e-క్రాప్‌తో రైతులకు మేలు

- క్షేత్రస్థాయిలో జరుగుతున్న ప్రక్రియ
- సెప్టెంబర్ 15 వరకూ అవకాశం
- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు



పంట వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

రాజానగరం: ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులకు ఈ- క్రాప్‌తో అనేక ప్రయోజనాలు కలుగుతాయి. పండించే పంట వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా వారికి ప్రభుత్వం నుంచి అన్ని రకాల లబ్ధి అందుతుంది. సాగులో సాయం, ఉత్పత్తులు అమ్ముకోవడం, విపత్తులు సంభవిస్తే నష్టపరిహారం పొందడానికి వీలుంటుంది. దీంతో రైతులందరూ ఈ-క్రాప్ చేయించుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. దీనికి సంబంధించిన ప్రక్రియ క్షేత్ర స్థాయిలో జరుగుతోంది.

గత నెలలో ప్రారంభం

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వ్యవసాయ, ఉద్యాన పంటల వివరాలను శాఖల వారీగా ఆన్‌లైన్ చేసే ప్రక్రియ (ఈ-క్రాప్)ను గత నెలలోనే ప్రారంభించారు. ఈ ప్రక్రియలో పంట సాగుహక్కు పత్రాలు పొందిన రైతులకు కూడా అవకాశం కల్పించారు. ప్రకృతి వైపరీతాల సమయంలో సాగు చేసిన పంటలు పాడై, నష్టాలకు గురైతే ఈ-క్రాప్ నమోదైన వివరాల ఆధారంగా బాధిత రైతులకు నష్టపరిహారం అందించటానికి అవకాశం ఉంటుంది.

పంట వివరాలు

సాగు చేస్తున్న రైతులు తమ సమీపంలోని ఆర్‌బీకేలకు వెళ్లి పంట వివరాలను నమోదు చేయించుకోవచ్చు. సాగు చేస్తున్న భూమికి సంబంధించిన సర్వే నంబర్, పట్టాదారు పాస్‌బుక్, సాగు చేసిన పంట వివరాలు, సాగు విస్తీర్ణం, మున్నగు వాటిని తెలియజేయాలి. ఇప్పటికే పలుచోట్ల ఆర్‌బీకేలలో ఉండే గ్రామ వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలు తమ పరిధిలోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేసే పనిలో ఉన్నారు.

64,965 ఎకరాల్లో వరి సాగు

రాజానగరం, అనపర్తి నియోజకవర్గాలలో 64,965 ఎకరాల వరిసాగు విస్తీర్ణ ఉంది. ఇంత వరకూ 52,235 ఎకరాలలో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేశారు. వీటితో పాటు 36,397 ఎకరాలలో మామిడి, జీడిమామిడి, నిమ్మ, నారింజ, బత్తాయి, సీతాఫలం, సపోటా, పనస వంటి ఉద్యాన పంటలు కూడా ఉన్నాయి.

15 వరకూ గడువు



రైతులు తాము సాగు చేస్తున్న పంట వివరాలను సత్వరమే ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలి. సెప్టెంబర్ 15 వరకూ కలెక్టర్ ఇచ్చిన గడువును సద్వినియోగం చేసుకోవాలి. క్షేత్రస్థాయిలో రైతు సేవ కేంద్రాల గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు పొలాలను సందర్శించి ఈ-క్రాపింగ్ ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. ఇంతవరకు నమోదు చేయించుకోకుంటే సత్వరమే పైన తెలిపిన వారిని కలిసి, నమోదు చేయించుకోండి.

– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయాధికారి

రైతులకు మేలు



ఈ-క్రాప్ వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఏ పంట, ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు, ఎంత మేరకు దిగుబడులు వస్తాయో కచ్చితమైన గణాంకాలు వేసుకునేందుకు అవకాశం ఉంటుంది. అలాగే ప్రకృతి వైపరీత్యాల సమయంలో పూర్తి స్థాయిలో నష్టపరిహారాలను పొందేందుకు కూడా ఈ విధానం ఉపయోగపడుతుంది. రైతులందరూ శ్రద్ధ తీసుకుని తమ పంట వివరాలను నమోదు చేయించుకోవాలి.

– ప్రగడ రాంబాబు, రైతు, నరేంద్రపురం

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆరికరేవుల గ్రామంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

బిక్కవోలు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కొంకుదురు పీహెచ్‌సీ వైద్యురాలు జి.విజయలక్ష్మి అన్నారు. ఆరికరేవుల గ్రామంలోని సచివాలయం వద్ద శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు జరిపారు. ఇద్దరికి టైఫాయిడ్, 16 మంది సాధారణ జ్వరం ఉన్నట్టు నిర్ధారణ చేశారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తన ఇల్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ డబ్బాల్లో నీరు రోజుల తరబడి నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమతెరలు తప్పకుండా వాడాలన్నారు. రెండు రోజులకు మించి జ్వరం ఉంటే వెంటనే వైద్యులు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలోని సర్పంచ్ రెడ్డి నాగవీరవేణి, మాజీ మార్కెట్ డైరెక్టర్ రెడ్డి శ్రీనివాసరావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



జి.మామిడాడ జెడ్పీ బాలికల హైస్కూల్లో మాట్లాడుతున్న హెచ్‌ఎం వెంకటరెడ్డి

పెదపూడి: మిషన్ శక్తి కార్యక్రమం ద్వారా చట్టాలపై బాలికలు, మహిళలు అవగాహన పెంచుకోవాలని జి.మామిడాడ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.వెంకటరెడ్డి అన్నారు. గ్రామంలోని జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత, మెయిన్ రోడ్డు ప్రాథమిక పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో శుక్రవారం మిషన్ శక్తి కార్యక్రమం జరిగింది. ఎస్.వెంకటరెడ్డి మాట్లాడుతూ మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా వంద రోజులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో బాలికలు, మహిళలు ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు కె.శ్రీనివాసు, డీఎస్‌వీ. సుబ్బారావు పాల్గొన్నారు.

జీజీయూలో ముగిసిన వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఫిక్కీ ఎనర్జీ మేనేజర్ అలీ అహ్మద్

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వాణి పథకంపై రెండు రోజులు నిర్వహించిన వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. పెట్రోలియం విభాగం ఆధ్వర్యంలో విద్యుత్ వాహనాలలో ఉపయోగించి వదిలేసిన బ్యాటరీల నుంచి పర్యావరణంలో వస్తున్న వివిధ పరిణామాలు అనే అంశం పై ఈ వర్క్‌షాప్ జరిగింది. విజయవాడలోని ఫిక్కీ ఎనర్జీ మేనేజర్ మోహర్ అలీ అహ్మద్ మాట్లాడుతూ బ్యాటరీల వలన పర్యావరణానికి కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జయానందకుమార్, కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్‌వీఆర్ నాగలక్ష్మి, హెచ్‌ఓడీ ఎండీ అహ్మద్ షరీఫ్, హెచ్‌ఓడీ డాక్టర్ వి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు



ఈలకొలనులో చెత్తను తొలగిస్తున్న కార్మికులు

రంగంపేట: వాతావరణం మార్పులతో గ్రామాల్లో పారిశుధ్య సమస్య వేధిస్తోంది. ఆగకుండా కురుస్తున్న వర్షంతో పరిస్థితి మరింత జటిలంగా మారుతోంది. కచ్చా డ్రైనేజీలు లేనిచోట రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తోంది. అలాగే మురుగునీటి నిల్వల కారణంగా దోమలు పెరిగి, ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దీంతో గ్రామ పంచాయతీలు పారిశుధ్య సమస్యపై దృష్టి సారించాయి. మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు తాత్కాలికంగా కచ్చా డ్రైన్లు ఏర్పాటు చేస్తున్నారు. సీసీ డ్రైనేజీల్లో పూడిక తీత పనులు జరుగుతున్నాయి. డ్రైనేజీల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను కార్మికులు తొలగిస్తున్నారు. మర్రిపూడి, పెదరాయవరం, జి.దొంతమూరు తదితర గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

వెంకటరత్నం సేవలు అభినందనీయం



వెంకటరత్నం దంపతులను సత్కరిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బంది

సీతానగరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో) పంపన వెంకటరత్నం అందించిన సేవలు అభినందనీయమని వక్తలు కొనియాడారు. ఉద్యోగ విరమణ చేస్తున్న ఆయనను శుక్రవారం సీతానగరం బస్టాండ్ సెంటర్ సమీపంలోని రాజుగారి కళ్యాణ మండపంలో సత్కరించారు. ఈ సందర్భంగా పంపన వెంకటరత్నం, సత్యవతి దంపతులను పీహెచ్‌సీ వైద్యులు ఏవీకే చైతన్య, ఎన్.రాజు, ఈ.ఏసురాణి, కె.మేఘన, మాజీ ఎంపీపీ పెందుర్తి దేవదాసు, వైద్య,ఆరోగ్యశాఖ సిబ్బంది సన్మానించి, జ్ఞాపికలు అందించారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ వెంకటరత్నం వృత్తిలో ఎంతో అంకితభావంతో పనిచేశారని, తన బాధ్యతలకు నూరు శాతం న్యాయం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వైఎస్ రాయుడు, పీహెచ్‌ఎన్ కె.ఆదిలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ స్వరూపరాణి, సూపర్ వైజర్లు సుధాకర్, దైవకృప, హెల్త్ అసిస్టెంట్ సుంకర నగేష్‌బాబు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఓపీ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి



క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రముఖులు

రాజానగరం: క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా జీవితంలో ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని రాక్ సిరామిక్స్ హెచ్‌ఆర్ హెడ్ డాక్టర్ టి.మనోజ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. స్థానిక గైట్ డిగ్రీ కాలేజీలో కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగం, ఎన్‌ఐపీఎం గోదావరి స్టూడెంట్ చాప్టర్ సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులను లక్ష్య సాధనలో కార్యోన్ముఖులను చేసే ప్రయత్నం చేశారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ ఆదాని గ్రూప్ జీఎం హెచ్‌ఆర్ డాక్టర్ శేషగిరిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లీమాధవి, స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ పీఆర్‌కే రాజు పాల్గొన్నారు.

నిల్వనీటితో తీవ్ర అవస్థలు



రఘుదేవపురంలో రోడ్డు పక్కనే నిల్వ ఉన్న నీరు

సీతానగరం: రఘుదేవపురంలో రాజమహేంద్రవరం – సీతానగరం రోడ్డు పక్కగా నిల్వ ఉంటున్న నీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రఘుదేవపురం వడ్డీరపేట నుంచి వచ్చే కాలువ ద్వారా సాగునీరు పంటపొలాలకు వెళుతుంది. ప్రతి ఏడాది ఈ కాలువను పొక్లెయిన్‌తో శుభ్రం చేసి, సాగునీటిని వదిలేవారు. ఈ కాలువ వడ్డీరపేట నుంచి కోట దుర్గమ్మ ఆలయం పక్కగా ప్రవహిస్తుంది. అయితే ఈ ఏడాది కోటదుర్గమ్మ ఆలయం వద్ద నుంచి శివారు వరకూ కాలువను బాగు చేయలేదు. దీంతో వడ్డీరపేట నుంచి చెత్త చెదారం కొట్టుకువచ్చి, రోడ్డును ఆనుకుని నిలిచిపోతోంది. సమీపంలోని ఇళ్ల మధ్యకు చేరుతోంది. ఈ సమస్యను అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని తాడి కోటేశ్, షేక్ రజాక్, దాసరి వీరపండు తదితరులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిల్వ నీటి నుంచి దుర్గంధం వెలుతోందని, దోమలు ప్రబలుతున్నాయన్నారు.

ఆకర్షణీయంగా గణపతి విగ్రహాలు



కోరుకొండలో విక్రయానికి సిద్ధం చేసిన వినాయక విగ్రహాలు

మధురపూడి: పిల్లలకు, పెద్దలకు ఎంతో ఇష్టమైన పండగ వినాయక చవితి వచ్చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతిచోటా గణపతి ప్రతిమలు కనువిందు చేస్తున్నాయి. విగ్రహాల తయారీపై ఆధారపడిన కొన్ని కుటుంబాలు దాదాపు రెండు నెలల ముందు నుంచే వీటి తయారీని ప్రారంభించాయి. ముఖ్యంగా మండల కేంద్రమైన కోరుకొండలో గణపతి విగ్రహాలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. రంగురంగుల్లో ఆకర్షణీయంగా ఉన్న విగ్రహాలను పలువురు కొనుగోలు చేస్తున్నారు. వీటి ధర రూ.2 వేల నుంచి రూ.30 వేల వరకూ పలుకుతోంది. అలాగే కోరుకొండ మండలంలోని 22 గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో పందిళ్లు నిర్మిస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



అనపర్తిలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



నన్నయ వర్సిటీలో మొక్క నాటుతున్న ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య శ్రీనివాసరావు

పెదపూడి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత, ప్రతి ఒక్కరూ విధిగా మొక్కను నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి గ్రామం సావరంలోని రామారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మిషన్ హరితాంధ్ర ప్రదేశ్ వనం – మనం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో అనపర్తి మండలంలోని అన్ని గ్రామాల్లో జీఎస్‌ఎల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో దంత వైద్యశిబిరాలు నిర్వహిస్తారన్నారు. ఆ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

నన్నయలో వనమహోత్సవం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం వనమహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రాంగణంలోని పరిపాలన భవనం ముంగిట ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణను కూడా బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే రాజానగరంలోని మండల ప్రజాపరిషత్ ఆవరణలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సతీమణి, జనసేన పార్టీ నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి మొక్కలను నాటారు.

బిక్కవోలు మండలంలో..

బిక్కవోలు: మండలంలోని ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్కనైనా నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని మాజీ ఎంపీటీసీ సభ్యులు గొర్రెల త్రిమూర్తులు అన్నారు. బిక్కవోలు పీహెచ్‌సీ వద్ద మొక్కలు నాటారు. డాక్టర్ విమల, ఎన్‌ఆర్‌జీఎస్ ఏపీవో అగస్టీన్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ రమణ, పాలచర్ల చిట్టబాబు చౌదరి పాల్గొన్నారు.

హోటళ్లలో అధికారుల తనిఖీలు

కంబాలచెరువు: నగరంలోని రెస్టారెంట్లలో రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆహార తనిఖీ శాఖాధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. విజిలెన్స్ ఎస్పీ కేఎస్‌వీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని కేఎఫ్‌సీ, పండలపాక బిర్యానీ హోటళ్లపై దాడులు చేసి కేసులు నమోదు చేశారు. కేఎఫ్‌సీలో వంటకు ఉపయోగిస్తున్న ఆయిల్ టీఎఫ్‌సీ పరిమితికి దాటి ఉండటాన్ని అధికారులు గుర్తించారు. దాని సాంద్రతను పరీక్షించగా 25 శాతం లోపు ఉండాల్సిన టోటల్ పోలార్ కాంపౌండ్స్ (టీఎఫ్‌సీ) 39.5 శాతంగా నమోదైంది. దీంతో ఆ హోటల్‌పై కేసు నమోదు చేశారు. అక్కడి చికెన్‌ను, ఫ్రై చేయడానికి సిద్ధం చేసిన ఆయిల్‌ను నమూనాలనూ తీసుకుని ల్యాబ్‌కు పంపారు.

పండలపాక అప్పారావు హోటల్‌పై..

గోకవరం బస్టాండ్ వద్ద నున్న పండలపాక అప్పారావు హోటల్‌పై అధికారులు దాడి చేసి కేసు నమోదు చేశారు. హోటల్‌లో తయారు చేసి తినడానికి రెడీ చేసిన చికెన్ ఫ్రై నమూనాలను నాణ్యత పరీక్ష కోసం హైదరాబాద్‌లోని స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపించారు. హోటల్ పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో నోటీసులు జారీ చేశారు. అక్కడ స్టాంప్ లేని తూకం యంత్రం వినియోగించడంతో లీగల్ మెట్రాలజీ అధికారులు ఆ మెషీన్‌ను సీజ్ చేసి, మరో కేసు నమోదు చేశారు. గృహావసరాలకు ఉపయోగించే గ్యాస్ సిలిండర్లను హోటల్లో వాడడంతో సివిల్ సప్లయిస్ అధికారులు వాటిని సీజ్ చేసి కేసు కట్టారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్సై జగన్నాథరెడ్డి, డీసీటీవో నవీన్‌కుమార్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రుక్కయ్య, లీగల్ మెట్రాలజీ అధికారి బాలాజీ, వలీ, కిశోర్, శివ, లోవరాజు, వీరబాబు పాల్గొన్నారు.

ఎస్సైగా రామ్‌కుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై రామ్‌కుమార్

సీతానగరం: ఎస్సైగా డి.రామ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పశ్చిమ గోదావరి జిల్లా పోడూరు నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ పనిచేసిన ఫణి మోహన్ వీఆర్‌కు వెళ్లినట్లు సమాచారం. నూతన ఎస్సై రామ్‌కుమార్‌కు స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

తెగిపడిన విద్యుత్ తీగ

రంగంపేట: ఈలకొలను గ్రామంలోని మెయిన్ రోడ్డులో శుక్రవారం విద్యుత్ తీగ తెగిపడింది. ఆ సమయంలో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. తీగ పడిన వెంటనే స్థానికులు విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. గ్రామ సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్తు లైన్లు అస్తవ్యస్తంగా ఉండటమే కాకుండా తెగిపోవడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని ఆ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. సంఘటనా స్థలానికి వచ్చిన విద్యుత్ సిబ్బందిని ఆయన నిలదీశారు. సమస్యనుపై అధికారులకు తెలియజేశామని, వర్షం తగ్గిన తరువాత సమస్యను పరిష్కరిస్తామని విద్యుత్తు సిబ్బంది తెలిపారు.

పలువురికి వైద్యపరీక్షలు



కోరుకొండలో నిర్వహిస్తున్న వైద్యశిబిరం

మధురపూడి: సీజనల్ జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో కోరుకొండ-1, పశ్చిమగానుగూడెం గ్రామ సచివాలయాల వద్ద శుక్రవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. కోరుకొండ పీహెచ్‌సీ డాక్టర్ ప్రగ్న ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాలలో పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించారు.

కేటాయించిన రేవుల్లోనే నిమజ్జనం చేయాలి



వంగలపూడి రేవును పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్, సీఐ కిషోర్

సీతానగరం: వినాయక విగ్రహాలను నిమజ్జనాన్ని కేటాయించిన రేవులలో మాత్రమే చేయాలని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, కోరుకొండ సీఐ వై.సత్యకిషోర్ అన్నారు. మండలంలోని వంగలపూడి, సింగవరం, ముగ్గళ్ల, మునికూడలి రేవులను శుక్రవారం ఆర్‌ఐ లక్ష్మి, ఏఎస్సై చక్రారెడ్డిలతో కలిసి వారు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నిమజ్జన సమయాలను తెలియజేస్తామని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విగ్రహాలను ఏర్పాటు, ఊరేగింపు, నిమజ్జనం విషయమై సింగిల్ విండో సిస్టమ్ ద్వారా ముందస్తుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే విగ్రహం ఏర్పాటు చేసే ప్రాంతంలో అన్ని నిబంధనలు పాటించాలన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

కంబాలచెరువు: కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల గరల్స్ హాస్టల్ వాష్ రూమ్‌లో హిడెన్ కెమెరాలు అమర్చిన దోషులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ సదరు కాలేజీలో చదువుతున్న విద్యార్థులే కొందరు సీనియర్ల సాయంతో కెమెరాలను అమర్చినట్టు వెలుగులోకి వచ్చిందన్నారు. ఈ విషయాన్ని యాజమాన్యానికి వారం రోజుల క్రితమే విద్యార్థినులు తెలియజేసినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. దీనిలో కేవలం సీనియర్ విద్యార్థుల ప్రమేయం మాత్రమే ఉందా లేకపోతే యాజమాన్యం, అక్కడ పనిచేసే వ్యక్తులకు సంబంధముందా అనే విషయంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

శ్రావణ లక్ష్మీ నమోస్తుతే..

పెదపూడి: శ్రావణ మాసంలోని నాలుగో శుక్రవారం సందర్భంగా పలు ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంపరలోని విజయదుర్గమ్మకు పంచామృతాభిషేకం చేశారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు, భక్తులు లక్ష్మీ సహస్ర పారాయణ చేశారు.

మహా కుంభాభిషేకం

బిక్కవోలు: కొమరిపాలెం గ్రామంలోని కనకదుర్గమ్మకు మహా కుంభాభిషేకం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు గోదావరి జలాలతో అమ్మవారిని అభిషేకించారు. బలభద్రపురం గ్రామానికి చెందిన కొవ్వూరి వెంకటరెడ్డి, వెంకయ్యమ్మ దంపతులు, కొవ్వూరి సతీష్‌రెడ్డి, శ్రీదేవి దంపతులు అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలోని ఆలయం కమిటీ సభ్యులు కొవ్వూరి పాపారెడ్డి, మల్లిడి పెద్దిరెడ్డి, జామీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

రంగంపేట: చంద్రేడు గ్రామంలోని శ్రీదేవి కనక దుర్గాదేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

రాజానగరం: స్థానిక రావుల చెరువు గట్టున ఉన్న రామాలయంలో కొలువైన మహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో శుక్రవారం మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఆచరించారు. ఆలయ పూజారి సాయి పంతులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు. ముక్కినాడలోని సాయినాథ్ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి. ఆలయ ధర్మకర్త అనదాస శేషయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



కొమరిపాలెంలో అమ్మవారి అభిషేకానికి గోదావరి జలాలను తీసుకువస్తున్న భక్తులు



రాజానగరంలో జరుగుతున్న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



ప్రత్యేక అలంకరణలో సంపర విజయదుర్గమ్మ



చంద్రేడులో కొలువైన శ్రీదేవి కనకదుర్గమ్మ